31న భీమవరంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం:రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో భీమవరం ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 31వ తేదీన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో అపోలో ఫార్మసీ, ధరణి మోటార్స్, ముత్తూట్ ఫైనాన్స్, జగదీష్ మెరైన్ వంటి కంపెనీల్లో భీమవరం ప్రాంతంలో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు https://naipunyam.ap.gov.in/user-registration రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలు కోసం శ్రీనివాస్ 8688594244, రాధిక 9440838388 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

దారు(లు)ణం..!

అస్తవ్యస్తంగా రహదారులు
ఏలూరు నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా ఇదే దుస్థితి
వర్షాలకు రోడ్లపై రాకపోకలు సాగించలేని పరిస్థితి
జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎదుటే ఎంఎల్ఎలు గగ్గోలు
కొత్తగా నిధుల కేటాయింపు లేదంటున్న ఆర్అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'2025 సంక్రాంతికి రోడ్లపై గుంతలు లేకుండా చేస్తాం' అంటూ కూటమి ప్రభుత్వం అప్పట్లో తెగ ఊదరగొట్టింది. సంక్రాంతి వెళ్లి ఏడు నెలలు గడిచినా ఇప్పటికీ రోడ్ల పరిస్థితిలో మార్పు లేకుండాపోయింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని రోడ్లపై గుంతలు పూడ్చి మమ అన్పించేసిన పరిస్థితి ఉంది. వర్షాలకు నీరు నిలిచిపోయి జనం నరకయాతన పడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 3,200 కిలోమీటర్ల వరకూ ఆర్అండ్‌బి రహదారులు ఉండగా, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఇతర రోడ్లు ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో జనంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో తాము అధికారంలోకి వస్తే రోడ్ల వ్యవస్థను బాగు చేస్తామని కూటమి నేతలు ఊదరగొట్టారు. కూటమి అధికారంలోకొచ్చాక రోడ్లపై గుంతలు పూడుస్తున్నామంటూ తెగ హడావుడి చేసింది. కొన్ని రోడ్లకు మరమ్మతులు చేసి వదిలేసింది. కొన్ని రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు కాగితాల్లో చూపించడం తప్ప పనులు మాత్రం ఇప్పటికీ ప్రారంభించలేదు. ఏలూరు నగరంలోని వంగాయగూడెం కేన్సర్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు అత్యంత దారుణంగా తయారైంది. మోటారు సైకిళ్లు సైతం వెళ్లలేని పరిస్థితి. పనులు మొదలయ్యాయని చెప్పడం తప్ప రోజులు గడిచిపోతున్నా గుంతలు మాత్రం పూడ్చలేదు. ఏలూరు నడిబొడ్డున ఉన్న సెంట్‌ఆన్స్ కాలేజీ రోడ్డు సైతం అత్యంత దారుణంగా తయారైంది. ఆ రోడ్డు గుండా వెళ్లాలంటేనే జనం భయపడే పరిస్థితి నెలకొంది. చింతలపూడి నుంచి కామవరపుకోట వెళ్లే రోడ్డు, టి.నరసాపురం వెళ్లే రహదారి అత్యంత దారుణంగా ఉన్నాయి. రాఘవాపురం వెళ్లే రోడ్డు సైతం అదేవిధంగా ఉంది. చింతలపూడి నియోజకవర్గంలో వస్తే రోడ్ల పరిస్థితి ఏమాత్రం బాగోలేదని స్థానిక ఎంఎల్ఎ ఇటీవల జరిగిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సమక్షంలోనూ మొరపెట్టుకున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో రోడ్ల పనులకు సంబంధించి ప్రణాళిక తయారు చేయాలని ఇన్‌ఛార్జి మంత్రి ఆదేశాలిచ్చారు. అధికారులు ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. నిధులిస్తారో, లేదో వేచిచూడాలి. ఉంగుటూరు నియోజకవర్గంలో మండల కేంద్రం నిడమర్రు నుంచి అడవికొలను వెళ్లే ఆర్అండ్‌బి రహదారిపై జనం రాకపోకలు ఆపేశారు. వర్షం వస్తే ఆ రోడ్డుపై వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. వైసిపి ప్రభుత్వ హయాంలోనే ఆ రోడ్డు ఇదేవిధంగా ఉండగా, ఇప్పుడు అంతకంటే దారుణమైన పరిస్థితిలో ఉంది. ఉంగుటూరు మండలంలో చేబ్రోలు పోలీస్ స్టేషన్ నుంచి తల్లాపురం రోడ్డు, రామచంద్రాపురం నుంచి నల్లజర్ల వెళ్లే రోడ్డు పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. పోలవరం మండలంలో బోడిగూడెం, గార్లగొయ్యి, ఇటుకలకోట, గుంజరం వెళ్లే రోడ్డుసైతం అస్తవ్యస్తంగా తయారైంది. దొండపూడి వెళ్లే రోడ్డు అత్యంత దారుణంగా మారడంతో జనం గగ్గోలు పెడుతున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ రోడ్ల పరిస్థితి అత్యంత భయానకంగా తయారైంది.

నిడమర్రు మండలం కేంద్ర నుంచి అడవికొలను వెళ్లే రోడ్డు వర్షం వస్తే ఇలా..

మాటలు తప్ప.. పనులు లేవ్..!

కూటమి ప్రభుత్వం మాటలు చెప్పడం తప్ప పనులు మాత్రం చేయడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. కొత్తగా రోడ్ల పనులకు సంబంధించి ఎటువంటి నిధులూ మంజూరు కాలేదని ఆర్అండ్‌బి అధికారులు చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే రోడ్ల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్పష్టమవుతోంది. అభివృద్ధికి సంబంధించి నియోజకవర్గాలవారీగా యాక్షన్ ప్లాన్‌పై ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. రోడ్లు, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తేనే అభివృద్ధి పనులపై ముందుకెళ్లే అవకాశం ఉంటుందని ఎంఎల్ఎలంతా ఘంటాపథంగా చెప్పారు. దీన్ని బట్టి రోడ్లు, తాగునీరు వంటి ఇతర మౌలిక సదుపాయాలు ఎంత అధ్వానంగా ఉన్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అధికారంలోకొచ్చి ఏడాది దాటినా ఇంకా రోడ్లు వేయకపోవడంతో జనాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జిల్లాలో రోడ్ల సమస్య ఎప్పటికి తీరుతుందో ప్రభుత్వమే చెప్పాలి.

కౌలు రైతులూ.. రుణాలు పొందండి

రూ.29,608 కోట్లు రుణాలు అందించడమే లక్ష్యం
వ్యవసాయ రుణాలకు మొదటి ప్రాధాన్యత
5,126 మంది కౌలు రైతులకు రూ.39 కోట్లు మంజూరు
గడిచిన మూడు నెలల్లో రూ.5,482 కోట్లు మంజూరు
ఎటువంటి సెక్యూరిటీ లేకుండా రూ.7.50 లక్షలు మేర విద్యా రుణాలు
లీడ్‌బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం

కౌలు రైతులంతా బ్యాంకులను సందర్శించండి... కౌలు గుర్తింపు కార్డు చూపించండి.. కావాల్సిన రుణాలు పొందండి. వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపేట వేసింది. వ్యవసాయ రుణాలు అందించేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయి. అర్హతున్న ప్రతి కౌలు రైతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్ సూచించారు. జిల్లాలో ఈ ఏడాది రూ.29,608 కోట్లు మేర రుణాలు అందించాలని లక్ష్యంగా తీసుకున్నామని, ఈ మూడు నెలల కాలంలో రూ.5,482 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రుణాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. 5,126 మంది కౌలు రైతులకు రూ.39 కోట్లు రుణాలు అందించినట్లు తెలిపారు. ఎటువంటి సెక్యూరిటీ లేకుండా రూ.7,50 లక్షలు మేర విద్యా రుణాలు అందిస్తున్నామని వివరించారు. జిల్లాలో రుణాల మంజూరు లక్ష్యం, ఇప్పటివరకు సాధించిన ప్రగతిపై జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్ 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: ఈ ఏడాది రుణ లక్ష్యం ఎంత తీసుకున్నారు?

ఎల్‌డిఎం: ఆయా రంగాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించి రుణాలు అందించడమే ధ్యేయంగా నిరంతరం పని చేస్తున్నాం. 2025-26 సంవత్సరానికి సంబంధించి జిల్లావ్యాప్తంగా రూ.29,608 కోట్లు మేర రుణాలు అందించాలని లక్ష్యంగా తీసుకున్నాం.

ప్రశ్న: ఏఏ రంగాలకు ఎంతెంత రుణాలు అందించాలని లక్ష్యంగా తీసుకున్నారు. ఎంతమేర అందించారు. ఏ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు?

ఎల్‌డిఎం: వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. వ్యవసాయ రుణాలు రూ.8,646 కోట్లు అందించాలని లక్ష్యంగా తీసుకున్నాం. ఇప్పటి వరకు రూ.2,506 కోట్లు అందించాం. అలాగే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రెండో ప్రాధాన్యతగా తీసుకున్నాం. పరిశ్రమల స్థాపనకు రూ.8,646 కోట్లు అందించేందుకు చర్యలు చేపట్టాం. అలాగే టర్మ్ రుణాలు రూ.4,800 కోట్లు లక్ష్యంగా తీసుకోగా, రూ.1,946 కోట్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ యంత్రాలు, పాడి పరిశ్రమకు రూ.1,839 కోట్ల లక్ష్యానికిగాను రూ.1,027 కోట్లు రుణాలు అందించాం. గృహనిర్మాణాల రుణాలకు సంబంధించి రూ.496 కోట్లు లక్ష్యంగా తీసుకోగా, రూ.66 కోట్లు అందజేశాం. ఇతర రుణాలు రూ.4,936 కోట్లు అందించేందుకు చర్యలు చేపట్టాం. వివిధ రంగాలకు మొత్తం రూ.15,057 కోట్లు అందించాలని లక్ష్యంగా తీసుకోగా, ఈ మూడు నెలల కాలంలో సుమారు రూ.5,482 కోట్లు అందజేశాం.

ప్రశ్న: ఎంతమంది కౌలు రైతులకు, ఎంత మేర రుణాలు ఇచ్చారు?

ఎల్‌డిఎం: జిల్లావ్యాప్తంగా వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం జిల్లాలో 63,262 మంది కౌలు రైతులు రుణార్హత కార్డులు కలిగి ఉన్నారు. ఇప్పటి వరకు 5,126 మంది కౌలు రైతులకు రూ.39 కోట్లు రుణాలు అందించాం. అర్హతున్న ప్రతి కౌలు రైతుకూ రుణాలిచ్చేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయి. కౌలు రైతులకు రుణాలు రావని వారిలో ఒక అపోహ ఉండిపోయింది. ఆ అపోహను తొలగించేందుకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి కౌలు రైతూ ఒకసారి బ్యాంకుకు వచ్చి రుణాలు కావాలని అడగండి. అర్హతుంటే తప్పనిసరిగా రుణం ఇచ్చే బాధ్యత మాది. కౌలు రైతులు బ్యాంకులకు రాకుండా రుణాలు రావట్లేదని అనుకోవడం అపోహ మాత్రమే.

ప్రశ్న: విద్యా రంగానికి ఎన్ని రుణాలు కేటాయించారు. ఇప్పటివరకు ఎంత ఇచ్చారు?

ఎల్‌డిఎం: విద్యార్థులకు విద్యా రుణాలు అందించేందుకు రూ. 118 కోట్లు లక్ష్యంగా తీసుకున్నాం. ఇప్పటివరకు రూ.15 కోట్లు మంజూరు చేశాం. డిగ్రీ, ఇంజినీరింగ్, ఏ చదువు చదువుకున్నా 65 శాతం మార్కులు సాధిస్తే విద్యా రుణానికి అర్హత ఉన్నట్లే. అలాగే పాలిటెక్నిక్, సిఎ, నర్సింగ్ విద్యార్థులకు కూడా వర్తిస్తుంది. ఒకొక్క విద్యార్థికి రూ.7.50 లక్షలు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా రుణాలు అందిస్తున్నాం.

ప్రశ్న: ప్రజలకు బీమా సౌకర్యాలు ఏమైనా కల్పిస్తున్నారా?

ఎల్‌డిఎం: ఆర్‌బిఐ దేశవ్యాప్తంగా జులై 1 నుండి సెప్టెంబర్ 31వ తేదీ వరకు జన సురక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లాలో 358 గ్రామాల్లో ప్రతిరోజూ బీమా సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ద్వారా 18 నుంచి 50 ఏళ్లు వయసుగల ప్రతిఒక్కరూ ఏడాదికి రూ.436 చెల్లిస్తే సాధారణ మరణానికి రూ.2 లక్షల వరకు వస్తుంది. అలాగే ప్రధానమంత్రి సురక్ష యోజన పథకంలోనైతే 18 నుంచి 70 ఏళ్లు ఉన్నవారు రూ.20 చెల్లిస్తే ప్రమాద బీమా రూ.రెండు లక్షల వరకు వస్తుంది.

ప్రశ్న: పాడి పరిశ్రమ, పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ఏమైనా పథకాలు ఉన్నాయా, ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

ఎల్‌డిఎం: స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో భాగంగా గేదెలు కొనుగోలు, గేదెల పెంపకానికి రుణాలు అందిస్తున్నాం. రైతులకు పసుపు కిసాన్ క్రెడిట్ కార్డులు అందిస్తున్నాం. ముఖ్యంగా రోజువారీ ఖర్చుల నిమిత్తం గేదెల పెంపకానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు అందిస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకులు ఉన్నాయి. జాతీయ బ్యాంకులు ఎన్ని?

ఎల్‌డిఎం: జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకులు 354 బ్రాంచీల వరకు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ బ్యాంకులు 195 వరకు ఉన్నాయి. జాతీయ బ్యాంకులు 15 వరకు ఉన్నాయి.

స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని ర్యాలీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలకు షాక్ కొట్టే అదానీ విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆరో రోజు అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఇంటింటా కరపత్రాలు పంచారు. హౌసింగ్ బోర్డు, మెయిన్ రోడ్డులో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరకాలంలోనే రూ.15,485 కోట్లు మేర ప్రజలపై విద్యుత్ భారాలు మోపిందన్నారు. భారాలు ఉపసంహరించుకుని, స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, దత్తు రాము, బర్ల బాలాజీ, కన్నంరెడ్డి శివాజీ, నగిరెడ్డి సాయి, కె.బాలాజీ, కె.పెద్దసోమురాజు, బి.వెంకటేశ్వరరావు, యడ్ల శ్రీను, పతివాడ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో భాగంగా కరపత్రాలు అందజేస్తున్న నేతలు

డిఎస్‌పి చక్రధరరావుకు కన్నీటి వీడ్కోలు

పాలకొల్లులో ముగిసిన అంత్యక్రియలు - భౌతికకాయాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్‌పి

డిఎస్‌పి చక్రధరరావు భార్యను ఓదార్చుతున్న కలెక్టర్ నాగరాణి, ఎస్‌పి అస్మీ

ప్రజాశక్తి - పాలకొల్లు

తెలంగాణలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాలకొల్లుకు చెందిన ఇంటెలిజెన్స్ డిఎస్‌పి మేకా చక్రధరరావు అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో చక్రధరరావు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని శనివారం రాత్రి పాలకొల్లు తీసుకొచ్చారు. చక్రధరరావు భౌతికకాయాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయాం అస్మీ, ఆర్మ్డ్ ఎస్‌పి అజీజ్, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు సందర్శించి, పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. చక్రధరరావు కుటుంబ సభ్యులను కలెక్టర్ ఓదార్చారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు. అనంతరం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పాలకొల్లు తహశీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, మున్సిపల్ కమిషనర్ విజయసారధి, సిఐ కె.రజనీకుమార్, ఎస్ఐ ప్రసాద్, రిటైర్డ్ తహశీల్దార్ వీరా పోతన తదితరులు నివాళులు చక్రధరరావుకు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

సింగపూర్‌లో చంద్రబాబుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి స్వాగతం

ప్రజాశక్తి - తణుకు

ఐదు రోజుల పర్యటన నిమిత్తం సింగపూర్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదివారం ఘన స్వాగతం పలికారు. గతంలో సింగపూర్ తెలుగు సమాజం అధ్యక్షునిగా పని చేసిన ఎంఎల్ఎ రాధాకృష్ణ అక్కడి నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాటాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ విశేష కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే రాష్ట్రంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు దిశగా పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు కుదుర్చుకునే ఉద్దేశంతోనే పలు దేశాల్లో పర్యటిస్తున్నారని తెలిపారు.



అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతోపాటు అనేక అభివృద్ధి పనులను చేపట్టిందని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. ఏలూరుపాడు జెడ్‌పి హైస్కూల్లో రూ.20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతి గదులను త్వరితగతిన నిర్మించి, అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు, ఎంపిటిసి చిన్నాపరపు రాంబాబు, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు, ప్రధానోపాధ్యాయులు జివి.సత్యనారాయణరాజు, రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ, టిడిపి నాయకులు వక్కపట్ల హరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నేతలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరుపాడు హైస్కూల్లో నూతన భవనాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

పాఠశాల పాయింట్‌కు సన్న బియ్యం పంపాలి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల పాయింట్‌కు సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి కోరారు. స్థానిక కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని ఎంఎల్‌సి గోపీమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన జెసి మాట్లాడుతూ సన్న బియ్యానికి సంబంధించిన కాంట్రాక్ట్ ఇచ్చారని, ఇప్పటికే కొన్ని పాఠశాలలకు పంపిస్తున్నారని తెలిపారు. స్కూల్ పాయింట్‌కు పంపే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. జెసిని కలిసిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, గౌరవాధ్యక్షులు పట్టాభిరామయ్య ఉన్నారు.

జెసితో మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

కొయ్యేటిపాడు సొసైటీ అభివృద్ధికి కృషి

ఛైర్మన్ పాలా భోగేశ్వరరావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

కొయ్యేటిపాడు వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని నూతన ఛైర్మన్ పాలా భోగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక సొసైటీ ప్రాంగణంలో జరిగిన ప్రమాణ స్వీకార సభలో ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఛైర్మన్‌గా పాలా భోగేశ్వరరావు, సభ్యులుగా సత్తి భామిరెడ్డి, పమ్మి సంజీవరావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు వెలగల బుల్లిరామిరెడ్డి, కార్యదర్శి మురళి, మాజీ జెడ్‌పిటిసి సత్తి ఆదినారాయణరెడ్డి, మాజీ ఎంపిటిసి కర్రి ఈశ్వర వెంకటరెడ్డి, సొసైటీ కార్యదర్శి కర్రి సతీష్‌రెడ్డి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు

గోరింటాడ సొసైటీ ఛైర్మన్‌గా వెంకటనారాయణ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని గోరింటాడ సొసైటీ ఛైర్మన్‌గా బోడపాటి వెంకటనారాయణ, సభ్యులుగా చెల్లబోయిన సహదేవుడు, సిరి మామిడి మన్మధరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి మండల మాజీ అధ్యక్షులు కోడి విజయభాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బోడపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ రైతులకు సొసైటీ ద్వారా అన్ని రకాల సేవలను సకాలంలో అందిస్తామన్నారు. గ్రామ సర్పంచి మండెల పావని నాని, ఎంపిటిసి మామిడిశెట్టి లలిత కుమారి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం మార్పుపై అభ్యర్థుల ఆందోళన

ప్రజాశక్తి - పెనుగొండ

స్థానిక ఎస్‌వికెపి ఎయిడెడ్ స్కూల్‌లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన నియామక పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులకు నిరాశే మిగిలింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెనుగొండ ఎస్‌వికెవి కెఎన్ రాజు కళాశాలలో ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి మూడు సెషన్లలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించేందుకు పరీక్షా కేంద్రంగా నిర్ణయించి అభ్యర్థులకు హాల్‌టిక్కెట్లు జారీ చేశారు. వాటి ప్రకారం పరీక్ష రాసేందుకు అభ్యర్థులు ఆదివారం స్థానిక ఎస్‌వికెపి కళాశాల వద్దకు వచ్చారు. అయితే అనివార్య కారణాల వల్ల పరీక్షా కేంద్రం తాడేపల్లిగూడెం, భీమవరం మార్చినట్లు చెప్పడంతో అభ్యర్థులు అవాక్కయ్యారు. ఇప్పటికిప్పుడు తాడేపల్లిగూడెం, భీమవరం ఎలా వెళ్లగమని వారంతా అక్కడే నిరసన తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండా పరీక్షా కేంద్రం మార్చడం ఏమిటని ప్రశ్నించారు.

ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

ఇది సరికాదు

జి.శైలజ, వికలాంగురాలు, పెంటపాడు

మాకు ఇచ్చిన కాల్ లెటర్‌లో ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి 2.30 గంటల వరకూ పరీక్ష అని ఉంది. గంట ముందే పరీక్షా హాలు వద్దకు వచ్చినా ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు తాడేపల్లిగూడెం వెళ్లి ఎలా పరీక్ష రాసేది. సమయం లేదు.

ఈ పరిస్థితి ఎప్పుడూ లేదు

కె.మహాలక్ష్మి, వికలాంగురాలు, రాచరంపూడి

ఎక్కడి నుంచో వచ్చాం. వచ్చిన తర్వాత ఇక్కడ సెంటర్ కాదని భీమవరం, తాడేపల్లిగూడెం సెంటర్లు మాకు చెప్పారు. ఇటువంటి సమాధానం యాజమాన్యం చెప్పడం విడ్డూరంగా ఉంది. ఇప్పటి వకూ చాలా పరీక్షలు రాశాం. ఈ పరిస్థితి ఎప్పుడూ ఎదురవ్వలేదు.

నేడు రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత ఆకివీడు రాక

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణా శాఖ మంత్రి వంగలపూడి అనిత సోమవారం ఆకివీడు రానున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్ తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో సోమవారం ఉదయం పది గంటలకు స్థానిక వెలమపేట రామాలయం వద్ద నుండి పాల్గొంటారని చెప్పారు. అనంతరం ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తా

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తానని ది.మునమర్రు వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ ఏడిద శివరామకృష్ణ పార్థసారధి తెలిపారు. ఆదివారం కమిటీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఛైర్మన్ పార్థసారధి మాట్లాడారు. ఈ సందర్భంగా సభ్యులు నూకల రాఘవస్వామి (నాని) మాట్లాడుతూ సహకార సంఘాన్ని అభివృద్ధి పరచడంతోపాటు రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు తమ కమిటీ కృషి చేస్తుందన్నారు.



మాట్లాడుతున్న మునమర్రు సొసైటీ ఛైర్మన్ పార్థసారధి

అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

అచ్యుతానందన్‌కు నివాళి

ప్రజాశక్తి - యలమంచిలి

కమ్యూనిస్టు యోధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ అందరికీ ఆదర్శనీయులని సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అన్నారు. చించినాడ అమరవీరుల స్మారక భవనం వద్ద ఆదివారం అచ్యుతానందన్ సంతాప సభ పార్టీ మండల కమిటీ సభ్యులు జిల్లెళ్ల ప్రశాంతి అధ్యక్షతన జరిగింది. సభలో బాలరాజు మాట్లాడుతూ అచ్యుతానందన్ కేరళ ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు ఎనలేని సేవలందించారని, తన జీవిత కాలమంతా ప్రజా జీవితానికి అంకితం చేసిన మహోన్నత ప్రజా నాయకుడని తెలిపారు. ఆయన మరణం అభ్యుదయ ప్రగతిశీల ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లుల నాగలక్ష్మి, కానేటి ఆదిలక్ష్మి, దుండి లలితాకుమారి, అప్పారి నాగమణి, దేవ సుధాకర్, గొల్ల కుమారి, జ్యోతి, కానేటి కుమారి, సుజాత రజిని పాల్గొన్నారు.

నిరుపేదలకు మానవత చేయూత

ప్రజాశక్తి - పెనుమంట్ర

నాగేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

నవ సమాజంలో నిరుపేద, నిర్భాగ్యలకు మానవత విలువైన సేవలందిస్తోందని ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ ఎన్‌కె.నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మార్టేరులోని మానవత కార్యాలయంలో జరిగిన మాస ప్రణాళికా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల అధ్యక్షులు శిరం విశ్వనాథం అధ్యక్షత వహించారు. మరో ముఖ్యఅతిథి యోగా గురువు రంజిత్ గురూజీ మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యమని తెలిపారు. అనంతరం ముఖ్య అతిధులను సంస్థ తరుపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బండి ప్రసాద్, కోశాధికారి అమృత వాక్కుల, పూర్వ అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, సంస్థ ప్రతినిధులు బాణాల శ్రీనివాసరావు, కడలి సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచి కర్రి వేణుబాబు పాల్గొన్నారు.

కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి

డాక్టర్ గాదిరాజు రంగరాజు

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో కలాం విగ్రహానికి నివాళు లర్పిస్తున్న మానవత సభ్యులు

మొగల్తూరులో..

విద్యార్థులంతా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలని మానవత అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. ఉప్పులూరులో మానవత శాఖ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కలాం విగ్రహానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మండల కో చైర్మన్ దంగేటి రామ లింగేశ్వరరావు మాట్లాడుతూ సైనికులకు ఉపయోగించే అనేక క్షిపణులు కనిపెట్టిన గొప్ప శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అని కొనియాడారు. కోశాధికారి కెటిఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రపతిగా ఉన్నప్పటికీ అబ్దుల్ కలాం సాదాసీదాగా ఉండేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, చింతాడ మహేష్ పాల్గొన్నారు.

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె.అబ్దుల్‌కలాం వర్ధంతిని ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ రాంబాబు మాట్లాడారు. భారతజాతి గర్వించదగ్గ గొప్ప మేధావి అబ్దుల్ కలాం అన్నారు. 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరు గడించారని, శాస్త్రవేత్తగా దేశానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో దొంగ శ్రీను, షేక్ మీరాసాహెబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరావు సేవలు ఎనలేనివి

ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

33 సంవత్సరాలుగా బ్యాంక్ ఆఫ్ ఇండియా వివిధ శాఖల్లో ఉద్యోగం చేస్తూ భీమవరం శాఖలో ఉద్యోగ విరమణ చేసిన ఎం.విశ్వేశ్వరరావుకు వీడ్కోలు సభ స్థానిక శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ విశ్వేశ్వరరావు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అందరి మన్ననలు పొందారన్నారు. ఆయన జీవితం ఆనందమయంగా గడవాలన్నారు. పలువురు పట్టణ ప్రముఖులు విశ్వేశ్వరరావు సేవలు కొనియాడారు. అనంతరం అభిమానులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు ఆయనను సత్కరించారు.


ప్రమాణ స్వీకారం చేసిన కిరాణా వర్తక సంఘం సభ్యులు

కిరాణా వర్తక సంఘం కమిటీ ప్రమాణ స్వీకారం

గణపవరం: గ్రామాల్లో చిరు వ్యాపారులకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలని కిరాణా వ్యాపార రంగాన్ని కాపాడాలని ఆదివారం ఇందిరమ్మ కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయ ఆవరణలో జరిగిన గణపవరం, సరిపల్లి, బువ్వనపల్లి కిరాణా వర్తక సంఘం నూతన కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం చేశారు. గౌరవాధ్యక్షులుగా కొల్లూరి బాల అశ్వద్ధామ నారాయణ (బాల), పెనగంటి రాము, అధ్యక్షులుగా బైరబోయిన మాల్యాద్రి, ఉపాధ్యక్షులుగా ఇందుగుల వెంకటరమణ, సలాది బద్రాచలం, ఉప్పల సందీప్, కార్యదర్శిగా శేగు వెంకట సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శిగా పి.నర్సింగ్, కోశాధికారిగా జువ్వల వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేశారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మూడు గ్రామాల కిరాణా వర్తకులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ జాతర ప్రారంభం

భీమవరం టౌన్: పట్టణంలో వాడవాడలా మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించడం శుభ పరిణామమని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఆదివారం భీమవరంలోని 10, 23, 24, 37, 38వ వార్డులో మావుళ్లమ్మ జాతరను ఆదివారం ఎంఎల్‌ఎ ప్రారంభించి మాట్లాడారు. సాంప్రదాయంగా అమ్మవారి జాతర వేడుకలను నిర్వహించడం అభినందనీయమని, ప్రతి ఒక్కరిలో దైవభక్తి ఆధ్యాత్మిక చింతన ఉండాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జాతర కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆక్వా రైతుల ఆందోళన..!

వాతావరణ మార్పులతో తగ్గిన ఆక్సిజన్ - తెగుళ్లతో మృత్యువాత పడుతున్న చేపలు, రొయ్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

తెగుళ్లతో చనిపోయిన చేపలు

వాతావరణ మార్పులతో ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గాయి. దీంతో అక్వా చెరువుల్లో రొయ్యలు, చేపలు తెగుళ్ల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల వేసవిని తలపించేలా ఎండలు.. అకస్మాత్తుగా వర్షం కురుస్తుండడంతో చెరువు నీటిలో ఆక్సిజన్ శాతంలో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. దీంతో రొయ్యలు, చేపలు చెరువు నీటి మధ్య భాగంలో విపరీతంగా తిరగడంతో నేలపై ఉండే అమ్మోనియా, నైట్రేట్, హైడ్రోజన్సల్ఫైడ్ వంటి విషవాయుల ప్రభావంతో జలచరాలు మృత్యువాత పడుతున్నాయి.

వ్యాధులు తీవ్రం..

వాతావరణ ప్రభావంతో రొయ్యలకు విబ్రియో, వైట్స్పాట్ వంటి బ్యాక్టీరియా, వైరల్ తెగుళ్లు, చేపలకు తాటాకు తెగులు, రెడ్డిసీజ్ వంటి వ్యాధులు సోకుతున్నాయి. దీంతో అధిక శాతంలో రొయ్యలు, చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పరిస్థితుల్లో చెరువులో ఆక్సిజన్ శాతం తగ్గకుండా చూడాలని, రాత్రి సమయంలో ఏరియేట్లు నిరంతరాయంగా తిరిగేలా చూడాలని అధికారులు చెబుతున్నారు.

రూ.45 లక్షలతో పోస్టుమార్టం షెడ్డు

సిహెచ్‌సి డాక్టర్ భువన

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో త్వరలో పోస్టుమార్టం నిర్వహించడానికి షెడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భువన తెలిపారు. ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ఇప్పటికే ఆసుపత్రిని మెడికో లీగల్ సెంటర్ (ఎంఎల్‌సి)గా గుర్తించారని చెప్పారు. అందుకు అవసరమైన సిబ్బంది సైతం ఇక్కడ నియమించారని, అయితే పోస్టుమార్టం కోసం ప్రత్యేకంగా ఒక షెడ్డు నిర్మించాల్సి ఉందని, ఆ షెడ్డు కోసం 45 లక్షల రూపాయలతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు. వీటితో ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయాలూ సమకూరినట్లు అవుతుందన్నారు. ఆసుపత్రిలో ఇప్పటికే స్కానింగ్, అన్ని రకాల రక్త పరీక్షలకు ల్యాబ్‌లు, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ తాను ఎంఎస్ కాగా, మత్తు వైద్యులు, చిన్నపిల్లల వైద్యులు, దంత వైద్యులు, గైనకాలజిస్ట్‌తోపాటు మరో ఇద్దరు ఎంబిబిఎస్ వైద్యులు మొత్తం ఏడుగురు ఉన్నారని చెప్పారు. వీటితోపాటు ఇక్కడ నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రానికి అనుబంధంగా రక్త నిధి కేంద్రాన్ని, ఎక్స్ రే, త్రీఫేస్ జనరేటర్లు సైతం ఏర్పాటు చేశారన్నారు. త్వరలో ఆసుపత్రి స్థాయి కూడా 100 పడకలకు పెరగనుందన్నారు.

చిట్ - చాట్

త్రిశూల్ పాయల్స్ పట్టీల ప్రపంచం' షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

షాపు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ అంజిబాబు

మహిళలు పాదాలకు పట్టీలు ధరించడం భారతీయ సంప్రదాయాల్లో ఒకటి అని, పట్టీలు ధరించిన ఆడపిల్ల సాక్షాత్తూ మహాలక్ష్మిగా భావిస్తారని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం తహశీల్దార్ కార్యాలయం రోడ్డులో ఆదివారం 'త్రిశూల్ పాయల్స్ పట్టీల ప్రపంచం' షోరూంను ఎంఎల్‌ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో రకాల వెండి పట్టీలు లభించే షోరూంను మన ప్రాంతంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. షోరూం పార్టనర్స్ పలివెల సురేంద్ర, తటవర్తి కిరణ్, వంకాయల కిరణ్, ప్రకాష్ మాట్లాడుతూ మహిళలకు కావాల్సిన అన్ని రకాల వెండి పట్టీలు లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేసిన ఎఎంసి నూతన పాలకవర్గం

ఎఎంసి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రైతులు మెచ్చుకునేలా ఎఎంసి నూతన పాలకవర్గం పని చేయాలని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణస్వీకారం పడాల మార్కెట్ యార్డులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళి, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి, బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సినిమాల్లో డబ్బులు తీసుకొచ్చి పార్టీని నడిపిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అన్నారు. ఎఎంసి పాలకవర్గం నిజాయతీగా పనిచేయాలన్నారు. ఎఎంసి చైర్మన్‌గా చాపల మంగా రమేష్, వైస్ చైర్మన్‌గా జగన్నాధపురం మాజీ సర్పంచి ముత్యాలు వీర వెంకట సత్యనారాయణ, కామిశెట్టి శ్రీనివాస్, గాజులూరు దుర్గా మల్లేశ్వరరావు, కొవ్వూరి లక్ష్మణ రెడ్డి, దూదేకుల దస్తగిరి, మద్దాల లక్ష్మీ ప్రసన్న, సామినేని సత్యవతి, మాదాసు నిహారిక, బొర్ల దుర్గ, వల్లేపల్లి గోపాలకృష్ణ, వాసా గణపతి, కళ్యాణం రామచంద్రరావు, కవులూరి పరిమళ, డైరెక్టర్లుగాను, కో ఆప్షన్ మెంబర్‌గా అడపా ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు.


తిల్లపూడి సొసైటీ ఛైర్మన్‌గా ఎన్నికైన కామిశెట్టి రంగారావు

తిల్లపూడి సొసైటీ కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం తిల్లపూడి సొసైటీ ఛైర్మన్‌గా కామిశెట్టి రంగారావు, సభ్యులుగా దిడ్ల నందియ్య, బొప్పనపల్లి రంగారావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ గ్రామంలోని నేతలు ఏ పార్టీలో ఉన్నా గ్రామాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలో రూ.9 కోట్ల టర్నోవర్‌తో తిల్లపూడి సొసైటీ ముందంజలో ఉందన్నారు. దీన్ని మరింత అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నడపన శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజులునాయుడు, ఇంటి శ్రీరాములు, అయ్యప్పనాయుడు, టిడిపి మండలాధ్యక్షులు పాముల రజినీ కుమార్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బోధనేతర పనులతో తగ్గిన విద్యా ప్రమాణాలు

యుటిఎఫ్ మండల కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బోధనేతర పనుల వల్ల విద్యా ప్రమాణాలు తగ్గిపోతున్నాయని, ఫలితంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతోందని యుటిఎఫ్ మండల కార్యదర్శి ఆర్‌విఎస్.నారాయణ (విక్రమ్) అన్నారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సంఘం మండల కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఇతర పనులపై దృష్టి పెట్టడంతో బోధనకు సమయం చాలక విద్యార్థులపై దృష్టి తగ్గుతోందన్నారు. ఇటీవల యాప్‌ల పని భారం బాగా పెరిగిందన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులపై చులకన భావన ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులను ఆపేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు జరిగి 40 రోజులు అయినప్పటికీ ఇప్పటివరకూ జీతాలు అందలేదని వెంటనే జీతాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. పిఆర్‌సి, డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ నిషేధం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ నిషేధం సామాజిక బాధ్యత అని, సమాజంలో ప్లాస్టిక్‌ను రూపుమాపాలని, జిల్లా వెనుకబడిన తరగతుల హాస్టల్స్ ఇన్‌ఛార్జి అధికారి కలిదిండి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం భీమవరంలో 5వ వార్డులో రాష్ట్ర వెనుకబడిన తరగతుల బాలుర హాస్టల్స్‌లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రజలు పాటించాలన్నారు. నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత అని, గుడ్డ సంచులను వినియోగించాలని తెలిపారు. అనంతరం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకుందాం - ప్రకృతిని రక్షించుకుందాం అంటూ ర్యాలీ ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ చిటికెల మోహన్‌రావు పాల్గొన్నారు.

నాగరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు,కార్యకర్తలు

టిడిపి అభివృద్ధికి నాగరాజు కృషి

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి మండలాధ్యక్షులు గుబ్బల నాగరాజు పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. నాగరాజు పుట్టినరోజు వేడుకలను మొగల్తూరులో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రామరాజు మాట్లాడుతూ నాగరాజు పార్టీలో మరిన్ని అత్యున్నత పదవులు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను నాగరాజు కోసి పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, కత్తిమండ ముత్యాలరావు, బొల్లా చంటి, పాలా రాంబాబు, పిఎంఎ.రాజు, పొన్నపల్లి శివ, పంపన భగవాన్, పెంకే చంటి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తూ॥గో॥జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, రాజమండ్రి వారి కోర్టులో

O.S. 48/2019

Between:
Nakkella Baburao ***...Plaintiff***
AND
Kesavarapu Venkata Bhaskara Rama Rao and Others
...Defendants

To:
D-6: Kesavarapu Sitarama Lakshmi, W/o. late Ramakrishna Rao, D.no. 14-9-14, Narasapuram, W.G.Dt.,
D-7: Kesavarapu Jaya Abhinav, S/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,
D-8: Kesavarapu Jhana Samhitha, D/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,

పై నెంబరు దావాలో 6 టు 8 ప్రతివాదులు అయిన మీకు దావా సమన్లు అమలు నిమిత్తం, ది. **05-08-2025** కి వాయిదా **అయివున్నది.** అందు విషయమై మీకు ఏమయినా ఆక్షేపణలు వున్నచో వాయిదా రోజున **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
మద్దూరి శివ సుబ్బారావు
మద్దూరి శివరామ శశిభూషణ్
వి.శ్రీనివాసరావు,పి.ఆర్.పి.యాదవ్
అడ్వకేట్లు, డోర్.నెం. 46-11-34
రాజమండ్రి దానవాయిపేట
20-7-2025 రాజమండ్రి-3

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి

నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న రామరాజు

రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం మొగల్తూరు పంచాయతీ భవానీ కాలనీలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మొగల్తూరు టౌన్ అధ్యక్షులు బొల్లా నారాయణవిఠల్ (చంటి), కత్తిమండ ముత్యాలరావు, పాలా రాంబాబు, పిఎంఎ.రాజు, గుబ్బల చిన నాగరాజు, డొల్ల రత్నంరాజు, కౌరు నాగేశ్వరరావు, పితాని శేఖర్, వెలిది పుల్లారావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, గుండు రాజా, జంపా పవన్, సరిహద్దుల దావీదు, బళ్ల శ్రీను, కామేశ్వరరావు యలమంచిలి విజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగస్టు 15వ వరకూ పది, ఇంటర్‌లో ప్రవేశాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2025 - 26 సంవత్సరానికి గాను పది, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం ప్రభుత్వం అనుమతిచ్చిందని ఎంఇఒ-2 యు.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశాలకు ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ ఆఖరి తేదీ అని తెలిపారు. ఎటువంటి విద్యార్హత లేకుండా 14 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ పదో తరగతిలో జాయిన్ అవ్వొచ్చని, అలాగే పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో జాయిన్ అవ్వొచ్చని పేర్కొన్నారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్‌ఇసి గ్రూపుల్లో చేరి కోర్సు కంప్లీట్ చేసుకో వచ్చని తెలిపారు. దీనికి సంబంధించి మండలంలోని ఆర్‌ఎ జెడ్‌పి హైస్కూల్‌ను ఎ-1 సెంటర్‌గా గుర్తించడం జరిగిందని, ఈ కోర్సుల్లో చేరదలచిన వారు ఆర్‌ఎ జెడ్‌పి హైస్కూల్ పెనుమంట్ర హెచ్‌ఎంను కలిసి అడ్మిషన్ పొందాలని తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పేరు మార్పు ప్రకటన

THOTA RAMA SWAROOP, S/o.THOTA RAMULU, డోర్‌నెం. 2-33/1, రాజరాజేశ్వరినగర్, తంగెళ్ళమూడి, ఏలూరు, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివశించుచున్నాను. ఇప్పుడు నాపేరు **THOTA RAMA SWARUP** (పాతపేరు), **S/o.THOTA RAMULU** నుండి **THOTA RAMA SWAROOP** (కొత్తపేరు) **S/o.THOTA RAMULU** గా మార్చుకున్నాను. ఈరోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్తపేరును ఉపయోగించవలెను.

THOTA RAMA SWAROOP,
S/o.THOTA RAMULU
డోర్‌నెం. 2-33/1, రాజరాజేశ్వరినగర్,
తంగెళ్ళమూడి, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

IN THE COURT OF THE VI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 3689 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law) & Authorized Officer, ...Plaintiff
And
Sri.J.V.Narendra ...Defendant

To
Sri.J.V.Narendra, S/o. Trimurthy, Aged about 51 Year, Occ: Business, R/o. Andhra Bank, Velpur Branch, No.5-133(Old), Tanuku(M),Velpur, W.G. District, A.P-534222.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.1,70,566-98ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 04-08-2025.
In case of your failure to attend before the Court on 04-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD**-50.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 2102 of 2023

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law) & Authorized Officer, ...Plaintiff
And
Smt.Ch.Rohini ...Defendant

To
Smt.Ch.Rohini, W/o.Ch.Hanmanth Rao, Aged about 48 Years, Occ: Business, R/o.Flat No.303, Swetha Sai Arcade, Srirampuram, NR Saibaba Temple, West Godavari Dist, A.P-534202.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,74,508-05ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 22-08-2025.
In case of your failure to attend before the Court on 22-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD**-50.